## సింగిల్ పేజీ కథలు

# గిరిజా కళ్యాణం

ఏమిటండీ మరీ పరధ్యానం ఎక్కువయిపోతోంది. ఎన్నిసార్లు పిలిచినా పలకరు'' సుబ్బారావు భుజాలు కుదిపి అడిగింది శ్యామల.

''ఏముంటుంది వేరే ఆలోచన. మన గిరిజ గురించే ఆలోచిస్తున్నాను'' విచారంతో అన్నాడు సుబ్బారావు.

''ఊ...ఇది మరీ బాగుంది. నాకు ధైర్యం చెప్పి మీరు అధైర్యపడుతున్నారా?'' జాలిగా అంది శ్యామల.

''అధైర్యం కాదు శ్యామలా? ఆలోచన. ఎక్కడ జరుగుతోంది లోపం అర్థం కావడంలేదు.''

''మనసుకి ఎంత సర్ది చెప్పుకున్నా ఆలోచనలు రాకపోవు'' దిగులుతో చెప్పింది శ్యామల.

''శ్యామలా! మనం చాలా సంబంధాలు చూసాము. అన్నీ మంచి సంబంధాలే. అన్ని సంబంధాలవారు మన గిరిజ నచ్చిందనే చెప్పారు. కొంతమంది తాంబూలాలికి ముహూర్తం ఎప్పుడు పెట్టుకుందామని కూడా అడిగారు. అలాంటివారంతా మళ్ళీ ఉత్తరం కూడా రాయలేదు. ఏం జరిగిందంటావు? నాకంతా అయోమయంగా వుంది'' సుబ్బారావు వేదనతో చెప్పాడు.

భర్త దిగుల్ని చూడలేని శ్యామల ''గిరిజను అడిగితేనో?'' అంది.

''వద్దు...వద్దు. ఆ పని మాత్రం చేయకు. అదసలే తిక్కపిల్ల. పెంకి జవాబిస్తుంది. దాని మాటలకు నువ్వేడుస్తావు. నీ బాధ చూసేటంత శక్తి నాకు లేదు. అంతా ఆ దేవుడిదే భారం అనుకుంటే మరే దిగులూ ఉండదు.''

''అవున్లెండి. దేవుడినే నమ్ముకోవాలి'' నిట్టూర్చింది శ్యామల. తల్లిదండ్రుల ఆవేదనను విన్న గిరిజ మౌనంగా ఉండిపోయింది.

★★★

వచ్చినవారిని ఆనందంతో, ఆశ్చర్యంతో చూస్తూ ''రండి...రండి''



అంది శ్యామల.

''సుబ్బారావుగారు లేరామ్మా?'' అడిగాడు రామారావు కూర్చుంటూ.

''ఉన్నారు. ఇప్పుడే పిలుస్తాను'' ఊపిరి సలపని ఆనందంతో లోపలికి వెళ్లి ''వాళ్ళొచ్చారు. పెళ్లివారొచ్చారు. త్వరగా రండి'' సుబ్బారావుకు చెప్పి పరుగులాంటి నడకతో హాల్లోకి వచ్చింది శ్యామల.

''మనం ఎవర్నీ పిలవందే ఎవరొస్తారు శ్యామలా?'' చిన్నగా అనుకుంటూ వచ్చిన సుబ్బారావుకి వాళ్ళను చూసి నోటమాట రాలేదు.

''మీరలా ఆశ్చర్యపోక ఇలా వచ్చి కూర్చోండి'' రామారావు నవ్వుతూ అన్నాడు.

''ఉత్తరం రాసి వద్దామనుకున్నాము. కానీ స్వయంగా మేమే ఈ శుభవార్త చెప్పాలని నిర్ణయించుకున్నాము'' రాజేశ్వరి చెప్పిన 'శుభవార్త' అన్న మాట విని సుబ్బారావు, శ్యామల మొహాలు ఆనందంతో వికసించాయి.

''గిరిజ కనిపించడం లేదు. ఇంకా ఆఫీసునుంచి రాలేదా?''

''ఇంకా రాలేదు. వచ్చే టైమయింది'' రాజేశ్వరికి జవాబు చెప్పింది శ్యామల.

''మీ గిరిజ బాగా నచ్చింది మాకు. మీ అమ్మాయి రూపమే కాదు, స్వభావం కూడా బాగా నచ్చింది. గిరిజ ఆలోచనా ధోరణి నచ్చింది'' రాజేశ్వరి చెప్పింది.

''ఇంతగా మా గిరిజను పొగుడుతున్నారు. మీతో ఏదైనా అందా?'' సుబ్బారావు మర్యాదగా అడిగాడు.

''అబ్బే...నాతో ఏమీ అనలేదు. మా శ్రీకాంత్‌కి చెప్పిందిట.''

''ఏమని?'' శ్యామల భయంతో అడిగింది.

''నాకు వివాహం జరిగితే నా తల్లిదండ్రులు నా దగ్గరే వుంటారు. ఇంక మీరు ఆలోచించుకోవాలి. నేను నచ్చానని చెప్పినందుకు థాంక్స్ అని మా అబ్బాయికి చెప్పిందిట'' రాజేశ్వరి చెప్పింది.

''ఈ విషయం మాకు తెలియదు'' భార్యాభర్తలు ఒకేసారన్నారు.

''అబ్బాయి, అమ్మాయి ఇద్దరూ సమానమే. కొడుకే కావాలనుకునే రోజులు కావు. కొడుకు, కూతురు అనే భేదభావాలు లేని రోజులివి. అమ్మాయిలు కూడా తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తున్నారు కనుక గిరిజ అభిప్రాయం సరైనది. మేము కూడా గిరిజతో ఏకీభవిస్తున్నాము'' రాజేశ్వరి నిష్కల్మషంగా చెప్పింది.

''మరి ముహూర్తాలు ఎప్పుడు పెట్టుకుందాము?'' రామారావు అన్నాడు.

''మీరే నిశ్చయించాలి'' అన్నాడు సుబ్బారావు.

కన్నవారిపట్ల గిరిజనుకున్న మమకారానికి తల్లి మనసు ఆనందంతో గర్విస్తోంది.

**-కె.పాలభాస్కరి**
గ్రౌండ్ ఫ్లోర్, ఫ్లాట్ నెం:20,
ఎఫ్ లేన్, సెక్టార్-8,
వాషి-400 703. న్యూ ముంబై.

# పాదపూజ

వటపత్రశాయిగారు మహామేధావి. గొప్ప పండితుడు. మంచి స్నేహశీలి. ఊర్లో ఎక్కడ ఏ సభ జరిగినా, సమావేశమైనా ఆయన వేదిక ఎక్కి నాలుగు మాటలు చెప్పందే విడిచిపెట్టరు.

'వృత్తిరీత్యా ఉపాధ్యాయుడిని. ప్రవృత్తిరీత్యా ప్రజల మనిషిని' అంటారు. పెద్దంచు పొందూరు సన్న ఖద్దరు పంచె, కండువా, కంటి మెడ లాల్చీ, నుదుట సిందూరం బొట్టు మనిషి నీట్‌గా వుంటాడు. వయస్సు 65 సంవత్సరాలు.

భజరంగ్ యూత్ క్లబ్‌ని మూడు దశాబ్దాల క్రితం చిన్నారావు దాదా స్థాపించాడు. ఏటా గణపతి నవరాత్రులు, దేవీ నవరాత్రులు, వసంతోత్సవాల్లాంటివి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తూ వాటికి అవసరమైన డబ్బును డొనేషన్స్ రూపాన వసూలు చేస్తున్నారు చిన్నారావు దాదా, అతని శిష్యులు. వారి మాటకు ఎదురు చెప్పే ధైర్యం ఊర్లో ఎవరికీలేదు. వారు అడిగినంత డబ్బు డొనేషన్ ఇవ్వాల్సిందే.

చిన్నారావు దాదా షష్టిపూర్తి ఫంక్షన్ ఎంతో ఘనంగా చెయ్యాలనుకున్నారు అతని శిష్యులు, యూత్ క్లబ్ మెంబర్స్. అవసరమైన ఏర్పాట్లు చేస్తూ సభా కార్యక్రమాన్ని పూర్తిగా నిర్వహించమని వారు వటపత్రశాయిగా

రిని కోరారు. ఖర్చు ఎంతయినా ఫర్వాలేదన్నారు. వటపత్రశాయిగారికి ఆనందానికి అంతులేదు. అది ఆయనకు లభించిన గొప్ప గౌరవంగా భావించారు. ఇన్విటేషన్స్ వేయించి ఊర్లో పెద్దలకు స్వయంగా ఇచ్చారు. సన్మాన పత్రం తయారు చేయించారు.

''సభా ప్రారంభం కావడానికి రెండుగంటలు ముందుగా వచ్చి ఏర్పాట్లు చెక్ చేస్తా''నని భరోసా ఇచ్చారు.

అన్నట్లుగానే రెండుగంటలు ముందుగానే బయలుదేరారు వటపత్రశాయిగారు. వారు తమ ఇంటి సందు మలుపు తిరిగేసరికి ప్రముఖ వ్యాపారవేత్త మృత్యుంజయరావుగారు మరణించారన్న కబురు వచ్చింది. లోగడ వటపత్రశాయిగారు ఎన్నో ఉపకారాలు పొందారు మృత్యుంజయరావుగారివల్ల. వారి కుటుంబ సభ్యులను కలిసి తన సంతాపం తెలియజేసి మృత్యుంజయరావుగారి మృతదేహాన్ని చూడ్డం తక్షణ కర్తవ్యంగా తలచి అటు వెళ్లారు. అనుకోని పరిస్థితులవల్ల అక్కడ నుండి బయటకు వచ్చేసరికి చాలా ఆలస్యం అయింది. ఇంటికి వెళ్లిరావడానికి వ్యవధిలేదు. ఆదరాబాదరగా వేదిక చేరుకున్నారు. వచ్చిన జనాలు చాలా అసహనంతో ఉన్నారు. వారంతా వచ్చింది సన్మాన సభ తరువాత ప్రదర్శించబోయే పాదుకా పట్టాభిషేకం నాటక ప్రదర్శన కొరకు.

''ఏందయ్యా ఇది! ఏటైపోనావు? రాజకీయ నాయకుడివనుకున్నావేటి నాలుగ్గంటలు ఆలీసంగా రాడానికి? మావోల్లు నీ ఇంటి సుట్టూ ముమ్మారు తిరిగారు. బేగి యెల్లి మీటింగ్ బిగిన్ సేయి'' అంటూ చిందులు తొక్కాడు చిన్నారావుదాదా. వాడి శిష్యులు నరేసరి వటపత్రశాయిగారిని వేదకమీదకు నెట్టారు.

వటపత్రశాయిగారు ఆవేశంతో తడబడుతూ సభా కార్యక్రమం ప్రారంభించారు. ప్రధాన వక్తగా ఆయన చిన్నారావు గుణగణాలను కొనియాడుతూ ''జాతస్యహి ధ్రువో మృత్యుర్ధ్రువం జన్మ మృతస్యచ! పుట్టిన వానికి చావు తప్పదు. చచ్చినవాడు తిరిగి పుట్టక తప్పదు అన్నాడు కృష్ణ పరమాత్మ. అందువల్లే 'అనిత్యాని శరీరాణి' కదా! ఎంతో ఉత్తముడు, గొప్ప ధార్మికుడు, దాత మన చిన్నారావుగారు ఈ రోజు మరణించడం ఎంతో విచారించ తగ్గ విషయం'' అని తన పొరపాటు గ్రహించి నాలుక కొరుక్కున్నారు వటపత్రశాయిగారు. ఆయన మృత్యుంజయరావుగారి మరణవార్త ఎంతకూ జీర్ణించుకోలేకపోవడంతో అనర్థం జరిగింది. అయితే వారు తన పొరపాటు గ్రహించి సరిదిద్దుకునేసరికి లేటైంది. వేదిక ప్రక్కనే వున్న చిన్నారావుదాదా శిష్యులు వటపత్రశాయిగారికి పాదపూజ చేసారు.

**-రావి-ఎస్-అవధాని**

25-12-6/1, ఎల్.కె.గార్డెన్స్
దాసన్నపేట
విజయనగరం-535 002.

# ఈ ప్రశ్నకు బదులేది?

ఆదివారం.

సాయంత్రం నాలుగు గంటలు.

ఉదయం నుంచి ఆమె మనసు మనసులో లేదు.

రకరకాల ఆలోచనలు ఆమె బుర్రని తినేస్తున్నాయి. తాను తీసుకోబోయే నిర్ణయం జీవితానికి సంబంధించినది. తిరిగి మార్చుకునే అవకాశం వుండదు కనుక ఆమె ఇంతగా ఆలోచిస్తోంది. అసలు విషయం మూర్తిని అడిగి తెల్సుకోవాలి అని నిర్ణయం తీసుకున్నాక ఆమె మనసుకు కొస్తంత ప్రశాంతత చిక్కింది.

రామచంద్రాపురం బ్రాంచిలో కొత్తగా ట్రైనింగ్ నిమిత్తం అడుగు పెట్టింది సునీత. ఆమె అందం, చలాకీతనం, చదువు అన్నీ మూర్తిని ఆకర్షించాయి. ఆమెది కూడా తన జిల్లానే కావడంతో బ్యాంక్ విషయాలు చర్చించుకోవడం దగ్గర్నుంచి ఇద్దరూ కలిసి క్యాంటీన్‌కు వెళ్లడం, లంచ్ బాక్సులు షేర్ చేసుకోవడం దాకా వచ్చింది.

సునీతకు వర్క్ నేర్పించే బాధ్యత కూడా మూర్తినే తీసుకున్నాడు. ఏ రోజయినా సాయంత్రం ఆలస్యమైతే స్కూటర్ మీద ఆమెని ఇంటిదాకా దింపేవాడు.

అలా మొదలైన ఆ పరిచయం ఆడ, మగ మధ్య వుండే సున్నితమైన సంశయపు పొరను ఛేదించుకుని బలమైన ఆకర్షణగా మారింది. అతనిమీద ఆమె ఎనలేని ప్రేమను పెంచుకుంది.

మరుసటిరోజు మూర్తితో ''మీతో అర్జంట్‌గా మాట్లాడాలి. సాయంత్రం ఆఫీసయిన తరువాత కలవండి'' అంది సునీత.

ఎన్నాళ్ల నుంచో కవ్విస్తున్న అందం ఎప్పుడెప్పుడు అనుభవించాలా అని తహతహలాడుతున్న మూర్తికి ఆ మాట శుభ



సూచకంగా అనిపించింది.

ఆ సాయంత్రం వాళ్లిద్దరూ సునీత ఇంటికి దారి తీసారు. పది నిముషాల య్యాక అసలు విషయంలోకి వచ్చిందామె.

''మూర్తిగారూ! మన సీనియర్ అకౌంటెంట్ దుర్గాదేవి నాతో ఏమన్నదో తెలుసా?''

మూర్తి ఆమెవైపు ప్రశ్నార్థకంగా చూసాడు.

''మూర్తి పెళ్లయినవాడు. అతనితో నువ్వు చనువుగా వుండడం, షికార్లు ఇవన్నీ ముందు ముందు ఎలా మారతాయో ఆలోచించుకో. అతనికి భార్యాబిడ్డలున్నారు. ఆ సంసారాన్ని నాశనం చేయకు. మంచి వాడిని ఎవర్నైనా పెళ్లి చేసుకో అంది.''

మూర్తి మొహంలో రంగులు మారిపోతున్నాయి.

''నిన్ను ఎప్పటికీ భార్యగా స్వీకరించడు. అందుకు వాళ్లావిడ ఒప్పుకోదు. ఉరేసుకుని ఛస్తానని బెదిరిస్తుంది. ఇది అతనికి కొత్తగాదు. ఇంతకు ముందు కూడా ఇలా ఎందరో అమ్మాయిల వెంట పడ్డాడు అంది.''

మూర్తికి ఏం చెప్పాలో తెలీడంలేదు. చివరకు-

''అవును. ఆమె చెప్పింది నిజమే. కానీ నిన్ను నేను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను.''

అంతే! మూర్తి చెంప ఛెళ్లుమంది.

''నీవు నన్ను ప్రేమిస్తున్నది నన్ను కాదు. నా వెనుకనున్న డబ్బును, నా ఉద్యోగాన్ని. అందమైన అమ్మాయి అందుబాటులో వుంది కదాని సినిమాలు, షికార్లు తిరగడం, ఆ అమ్మాయికి విషయం తెలీకపోతే ఏదో తూతూ మంత్రం పెళ్లి చేసుకుని కొన్నాళ్ళు ఎంజాయ్ చేసి మొహం చాటేయడం...''

''కానీ నీ విషయంలో అలా జరగదని హామీ ఇస్తున్నాను'' కాళ్ళ బేరానికి వచ్చాడు మూర్తి.

''చూడు. నేనో వ్యక్తికి రెండో భార్యగానో, ఉంపుడుగత్తెగానో ఉండాలనుకోవడంలేదు. నాకు అందం వుంది. చదువుంది. చక్కని ఉద్యోగం వుంది. వీటన్నింటితోపాటు ఆత్మవిశ్వాసం వుంది. నాకు యోగ్యుడైనవాడు, నన్నర్థం చేసుకున్నవాడు లభించేదాకా ఈ సమాజంలో ఒంటరిగా బ్రతకగలను. దయచేసి ఇంకెప్పుడూ నా జోలికి రాకు'' అంది సునీత.

మూర్తి తల వంచుకుని నిష్క్రమించాడు.

ఈ ప్రశ్నకు బదులిదే! ఆమె అతన్ని పెళ్లాడి పిల్లల తల్లిని అయితే ఆమె బిడ్డ 'నాన్న ఎందుకు ఎప్పుడూ ఇక్కడుండడు?' అని ప్రశ్నిస్తుంది. సమాజం మన్నెందుకు పరిహసిస్తుంది? అని కూడా అడుగుతుంది. చేతులు కాలాక ఆకులు పట్టుకుని ప్రయోజనం వుండదు.

ఇప్పుడు సునీత మనసు ప్రశాంతంగా వుంది.

మూర్తిని పెళ్లాడడంవల్ల ఆమెకు సోషల్ స్టేటస్ లభించదు. సమాజంలో గుర్తింపు వుండదు. నిరంతరం అతనెప్పుడూ వదిలి వెళ్లిపోతాడోనన్న అభద్రతతో బ్రతకాలి. కానీ ఇప్పుడు ఆమె స్వేచ్ఛాజీవిగా ఆనందంగా బ్రతకొచ్చు. ఆ నిర్ణయం తీసుకున్నాక ఆమెలో టెన్షన్ మాయమై ఉత్సాహం చోటు చేసుకుంది.

**-డా. చిత్తూరి కోటేశ్వరరావు**